క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను హోం మంత్రి తానేటి వనిత గురువారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, బంగాళా దుంపలు, కందిపప్పు, ఉల్లిపాయలు, కిలో నూనె చొప్పున 434 కుటుంబాలకు ఆమె అందజేశారు. గోదావరి వరద గ్రామాన్ని చుట్టు ముట్టడంతో గ్రామస్తులు ఉపాధి కోల్పోయారన్నారు. భవిష్యత్తులో గ్రామానికి గోదావరి వరద ముంపు బెడద రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. సర్పంచ్ బొలిశెట్టి రత్నకుమారి, మాజీ సర్పంచ్ కంచుమర్తి వెంకట్రావు, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఆత్కూరి దొరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గాలకు నియామక పత్రాల అందజేత

నిడదవోలు: రైతుల అభ్యున్నతిలో సొసైటీల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. నియోజకవర్గంలోని 33 సొసైటీల పాలక వర్గాలతో పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం పాలక వర్గాలకు పదవీ కాలాన్ని పొడిగిస్తూ సొసైటీల అధ్యక్షులకు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. జిల్లా వ్యసాయ సహకార పరపతి అధికారి వై.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పెట్రోల్ బంకులు, హోటల్స్ వంటి 24 సర్వీసుల నిర్వహణకు సొసైటీలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే పెరవలి మండంలో సొసైటీల ద్వారా రెండు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారన్నారు. సొసైటీల అధ్యక్షులు సుంకవల్లి శ్రీహరి, గజ్జరపు రమేష్, నాగిరెడ్డి నాగేశ్వరరావు, బలుసు రంగారావు, కఠారి సిద్ధార్థ, నాగిరెడ్డి వెంకటేశ్వరావులు సొసైటీల చేపడుతున్న రైతు సేవలను వివరించారు. పెరవలి ఎంపీపీ కార్చర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ మండల సొసైటీ పాలక వర్గాలను ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడుని ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత


విజయవాడ ఆసుపత్రిలో పింఛను సొమ్ము అందిస్తున్న వలంటీర్ లక్ష్మీదుర్గ

తాళ్లపూడి: కిడ్నీలు దెబ్బతిన్న తిరుగుడుమెట్టకు చెందిన వృద్ధురాలు బత్తి బ్రహ్మమ్మ విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటూ కొద్ది రోజులుగా అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ గ్రామ వలంటీర్ కొత్తపల్లి లక్ష్మీదుర్గ తన సొంత ఖర్చులతో విజయవాడ ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్మును అందజేసి వచ్చింది.

మెట్టలో ఆయిల్ పామ్ సాగు పెంచాలి

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని అన్ని రకాల భూముల్లోనూ పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయాలని ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ బాలాజీ నాయక్ రైతులకు సూచించారు. యర్నగూడెం వద్ద గల 3 ఎఫ్ ఆయిల్‌పామ్ పరిశ్రమ ఆధ్వర్యంలో సమీప ఆయిల్‌పామ్ తోటలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పామాయిల్ సాగుపై బాలాజీ నాయక్ అవగాహన కల్పించారు. 3 ఎఫ్ ఆయిల్ పామ్ జీఎం విజయప్రసాద్ మాట్లాడుతూ వచ్చే పొట్టి రకాల ఆయిల్ పామ్ విత్తనాలను మలేషియా, ఇండోనేషియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుని రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతు గద్దే రాంప్రసాద్ పొలంలో మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ ఏడీఏ శాంతి, నల్లజర్ల, దేవరపల్లి, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు కొరత లేకుండా చూడాలని ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ బాలాజీ నాయక్ 3 ఎఫ్ ఆయిల్ పామ్ సంస్థను ఆదేశించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఆయన మండలంలోని ముసుళ్ళగుంట వద్ద నర్సరీని కూడా సందర్శించారు. ముసుళ్ళగుంట సర్పంచ్ నందమూరి శారదాదేవి బాలాజీ నాయక్‌ను శాలువాతో సత్కరించారు. ఆయనవెంట ఏడీహెచ్ శాంతి, 3ఎఫ్ జీఎం విజయేంద్రప్రసాద్, నల్లజర్ల ఉద్యాన అధికారి బబిత పాల్గొన్నారు.

కేంద్ర నిధులు ప్రజలకు అందేలా చూడాలి

గోపాలపురం: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని గురువారం ఇక్కడి ఆ పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్ముల దత్తు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి నియామకంపై నాయకుల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, జిల్లా నాయకులు కొండేపాటి రత్నాజీ చౌదరి, పి నాగేంద్ర, అడపా సుబ్రహ్మణ్యం, పిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటికే పోషకాహారం

- పోషకాలతో కూడిన పది రకాల సరకుల అందజేత
- గర్భిణులు, బాలింతలకు వెసులుబాటు
- డివిజన్‌లో 6,697 మంది లబ్ధి


కొవ్వూరులో ఇంటికే పోషకాహార కిట్లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత (ఫైల్)

కొవ్వూరు/గోపాలపురం: గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం తయారు చేసి గర్భిణులు, బాలింతలకు అందించే వారు. ఎక్కువ శాతం మంది కేంద్రానికి వచ్చి తినడానికి ఆసక్తి కనబరచడం లేదు. సరాసరిన కేవలం 60 శాతం మంది మాత్రమే ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారని గణాంకాలు తేల్చాయి. నూరు శాతం గర్భిణులు, బాలింతలు ఈ పోష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంటికే పోషకాహార కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 668 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 3,686 మంది గర్భిణులు, 3,001 మంది బాలింతలు ఉన్నారు. వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటివరకూ అందించిన స్పాట్ ఫీడింగ్‌కు బదులుగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందిస్తున్నారు. కొవ్వూరులో బుధవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆగస్టు-2 నుంచి డివిజన్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీహెచ్ఆర్‌తో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పది రకాల సరుకులతో కూడిన కిట్లు అందిస్తున్నారు.

టేక్ హోమ్ రేషన్ ద్వారా అందిస్తున్న ఒక్కో పోషకాహారం సరుకుల కిట్ కోసం సరాసరిన ప్రభుత్వం రూ.900 చొప్పున వెచ్చిస్తోంది. ఈ లెక్కన డివిజన్‌లోని మూడు ప్రాజెక్టుల పరిధిలోని 6,697 మంది గర్భిణులు, బాలింతలకు నెలకు రూ.60.18 లక్షల చొప్పున ఖర్చు చేస్తోంది. ఏడాదికి ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.7.22 కోట్లు ఖర్చవుతోంది. ప్రధానంగా టీహెచ్ఆర్‌లో మూడు కిలోల బియ్యం, కేజీ పప్పు, అర లీటర్ ఆయిల్, 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు ఉంటాయి. ఇందుకయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరో 50 శాతం చొప్పున భరిస్తాయి.

డివిజన్‌లో ప్రాజెక్టుల వారీగా వివరాలు

ప్రాజెక్టు పేరు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	మొత్తం
పెరవలి	211	1,314	1,060	2,374
గోపాలపురం	234	1,200	1,052	2,252
కొవ్వూరు	223	1,172	889	2,071
మొత్తం	668	3,686	3,001	6,697

రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1.87 కోట్ల అదనపు భారం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అందించే ఐదు రకాల సరుకులను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తోంది. వాటిలో రాగి పిండి రెండు కిలోలు, ఆటుకులు కేజీ, వేరుశనగ చిక్కి, ఖర్జూరం, బెల్లం ఒక్కొక్కటి 250 గ్రాముల చొప్పున ఉంటాయి. ఇందుకు రూ.233.40 అవుతుంది. ఈ లెక్కన నెలకు రూ.15.61 లక్షలు చొప్పున ఏడాదికి రూ.రూ.1.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఖర్చు చేస్తోంది.


టేక్ హోమ్ రేషన్ ద్వారా అందిస్తున్న పది రకాల సరకులు

కిట్‌లో అందించే సరకులివే..

ఒక్కో బాలింత, గర్భిణికి అందించే కిట్‌లో పోషక విలువలతో కూడిన పది రకాల సరుకులు ఉంటాయి. బియ్యం మూడు కిలోలు, పప్పు కేజీ, ఆయిల్ 500 గ్రాములు, గుడ్లు ఫస్ట్ ఫేజ్‌లో 13, రెండో ఫేజ్‌లో 12, పాలు కూడా మొదటి విడతలో 2.5 లీటర్లు, రెండో విడతలో 2.5 లీటర్ల చొప్పున అందిస్తున్నారు. వాటితో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద రాగి పిండి రెండు కిలోలు, అటుకులు కేజీ, వేరుశనగ చిక్కి, ఖర్జూరం, బెల్లం ఒక్కక్కటి 250 గ్రాముల చొప్పున అందిస్తున్నారు.

బిడ్డకు సమృద్ధిగా పాలు



టేక్ హోమ్ రేషన్ కిట్ల వల్ల తల్లిపాలు సమృద్ధిగా శిశువులకు అందుతాయి. బిడ్డకు కావాల్సిన పోషకాలను అందించగలుగుతాం. పుట్టబోయే బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పది రకాల సరుకులు నాణ్యంగా ఉన్నాయి.

–లచ్చిరెడ్డి రమ్య, బాలింత, గోపాలపురం

బిడ్డ ఆరోగ్యంగా పుడతాడు



టేక్ హోమ్ రేషన్ కిట్ల ద్వారా నాకు పౌష్టికాహారం అందుతుంది. ఈ కిట్లలోని సరకులను బయట మార్కెట్‌లో కొనుగోలు చేయలేం. దాంతో నాకు పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడు. ఇందుకు చర్యలు తీసుక్ను జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

–రామన దుర్గాభవాని గర్భిణి, గోపాలపురం

ప్రతి గర్భిణికి, బాలింతకు అందిస్తున్నాం



టేక్ హోం రేషన్ కిట్లను ప్రతి నెలా ఐసీడీఎస్ పరిధిలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుర్తించిన గర్భిణులు, బాలింతలకు ఆయా సెంటర్ల నుండి అందిస్తున్నాం. ఈ కిట్లలోని ఆహారం తీసుకోవడం వల్ల మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత తగుతుంది. తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారు.

- వైటీటీ సుందరి, సీడీపీఓ, గోపాలపురం

తాడిపూడి లిఫ్ట్-2 నుంచి నీటి విడుదల


ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం గుడ్డిగూడెం రోడ్డులోని తాడిపూడి లిఫ్ట్- 2 కాలువ నుంచి గురువారం ఆయన విద్యుత్తు బటన్ నొక్కి ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపూడి లిఫ్ట్- 2 నుంచి సుమారు 27 వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కె వల్లీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, రైతులు దొండపాటి సత్తిరెడ్డి, అవుతు చిన్ని, దొమ్మేటి కృష్ణంరాజు, తాడిపూడి లిఫ్ట్ డీఈ టి. శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

9,025 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

నల్లజర్ల: మండలంలో ఇంతవరకూ 9,025 ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మండలంలో ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం 10,800 ఎకరాలని ఆయన పేర్కొన్నారు. అనంతపల్లిలో గురువారం పొలంబడి మూడో వారం నిర్వహించారు. సాగులో కొద్దిపాటి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన రైతులకు సూచించారు. వరి పంటకు మోతాదుకు మించి ఎరువుల వినియోగం అనర్థదాయకం అని సూచించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా అందిస్తున్న సూచనలను రైతులు పాటిస్తూ సాగు ఖర్చు తగ్గించుకోవడమ గాకుండా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.

సుపరిపాలనను ఆశీర్వదించండి


కొవ్వూరు తొమ్మిదో వార్డులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత


కాల్దారిలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 9వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆశీర్వదించాలని హోం మంత్రి తానేటి వనిత కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో గురువారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి గురించి ఆమె వివరించారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, వార్డు ఇన్‌చార్జ్ సత్యవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఉండ్రాజవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక సంక్షేమ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే అందిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. కాల్దారి గ్రామంలో నాలుగో రోజు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంటి యజమానులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. గత ప్రభుత్వ హయంలో పథకాల లబ్ధి కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు ద్వారా నేరుగా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. ఇంతటి గొప్ప వ్యవస్థను తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, ఎంపీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు.. అందుకే సురక్ష


కొవ్వూరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత


దేవరపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


నిడదవోలులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో సక్సెస్ మీట్

కొవ్వూరు: అర్హత ఉండి ఏ కారణంగా చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష సక్సెస్ మీట్‌లో మంత్రి మాట్లాడారు. వలంటీర్ పరిధిలోని ప్రతి క్లస్టర్‌లోనూ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల కుటుంబాలను సర్వే చేసి 93.05 లక్షల క్యాంపులు నిర్వహించామన్నారు. వాటి ద్వారా 97 శాతం ప్రజా సమస్యలను పరిష్కరించినట్టు మంత్రి ప్రకటించారు. జూలై 1 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగిందన్నారు. ఒక్క జూలై 18న రాష్ట్రంలో 7.54 లక్షలు మందికి సరిఫికెట్లు అందజేశారన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 69,507 కుటుంబాలను సందర్శించి 62 సచివాలయాల వద్ద శిబిరాలు నిర్వహించి 63,693 మందికి లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షులు జుట్టా ఏడు కొండలు పాల్గొన్నారు.

గోపాలపురంలో 65,149 వినతుల పరిష్కారం

దేవరపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గోపాలపురం నియోజకవర్గంలో అందిన వినతుల్లో 98 శాతం పరిష్కరించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగనన్న సురక్ష ద్వారా పరిష్కరించిన సమస్యలను వివరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 81 గ్రామ సచివాలయాల పరిధిలో 90 వేల గృహాలను వలంటీర్లు సందర్శించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో 1.05 లక్షలు గృహాలు ఉన్నాయన్నారు. సురక్షలో ప్రజల నుంచి 66,165 వినతులు రాగా, 65149 వినతులను వేదికలపై పరిష్కరించినట్టు తలారి వివరించారు. మిగిలిన సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని చెప్పారు.11 రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, కాకులపాటి లలిత పాల్గొన్నారు.

నిడదవోలులో 80,757 ధ్రువ పత్రాలు

నిడదవోలు: జగనన్న సురక్ష శిబిరాల ద్వారా నియోజకవర్గంలో 80,757 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేసినట్టు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు వెల్లడించారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని 74 సచివాలయాల పరిధిలో 77,443 గృహాలను వలంటీర్లను సర్వే చేసి అర్హులను గుర్తించారన్నారు. పథకాలకు అర్హులైనా ధ్రువ పత్రాలు లేవన్న కారణంతో లబ్ధి పొందలేని ప్రజలకు మేలు చేకూర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ప్రజలకు కచ్చితంగా అవసరమయ్యే కీలక పత్రాలను అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. నియోజకవర్గంలో జులై 1 నుంచి 30 రోజుల పాటు జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహించామన్నారు.

ఊరూరా సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


నిడదవోలులో పోషకాహార కిట్లు అందుకున్న గర్భిణులు, బాలింతలు

నిడదవోలు రూరల్: మాతా శిశు సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సమిశ్రగూడెంలోని గీతా మందిరంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) పథకాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయడు గురువారం ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను ఆయన అందజేశారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఐసీడీసీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నళిని పాల్గొన్నారు.

కొవ్వూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా కాపవరంలో గురువారం పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, గోవర్ధన గిరిమెట్ట అంగన్‌వాడీ కేంద్రాలోని 45 మంది గర్భిణులు, బాలింతలకు కిట్లు అందజేశారు.

నిడదవోలు: స్థానిక ఇందిరానగర్, 04వ వార్డులలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు యలగాడ బాలరాజు, గంగుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. బండారు పద్మా, గేదెల బేబి, గంగుల గోపియాదవ్, షేక్ కద్రున్నీషా, మిమల, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కాకరపర్రులో సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి చేతుల మీదుగా గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లనుగర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ చెల్లింకుల శ్రీవిజయ, సీడీపీవో మమ్మి, ఎంపీడీవో బి.రాంప్రసాద్, సర్పంచులు మట్టా వెంకట్రావు, గురువెల్లికుమారి, ఎంపీటీసీలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అవయవ దానంతో ప్రాణదానం


మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం : అవయవాలను దానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఆర్గాన్ డొనేషన్ (అవయవ దాన) దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వ్యక్తి మరణానంతరం ఎంతో విలువైన అవయవాలను మట్టి పాలు చేయడం కంటే దానం చేయడం ద్వారా మరొకరికి పునః జన్మ ప్రసాదించిన వార వుతారన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ భగవన్నారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాసు, దోనేపూడి సుధాకర్, పాలాటి శరత్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులూ.. సమస్యలు పరిష్కరించండి

- ప్రశ్నించిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు
- చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరాస్వామి

చాగల్లు: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. నాడు- నేడులో చేపట్టిన చంద్రవరం పాఠశాల ప్రహరీ నిర్మాణంలో జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులపై సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. నందిగంపాడు సర్పంచ్ కుదప రాంబాబు మాట్లాడుతూ పాఠశాలలో పనులు నిర్వహించి మూడేళ్లైనా పూర్తిస్థాయి వేతన బిల్లులు మంజూరు చేయడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సమావేశాలకు కొందరు అధికారుల గైర్హాజరు కావడంపై చిక్కాల ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన అధికారులు కూడా సమావేశం పూర్తికాకముందే వెళ్లిపోతున్నారన్నారు. బ్రాహ్మణగూడెంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు కోరారు. చాగల్లు మెయిన్ రోడ్‌పై అదనంగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి కోరారు. చాగల్లులోని ఇస్లాంపేట, ప్రధాన కూడలిలోని మంచినీటి ట్యాంకుల లీకేజీలను అరికట్టాలని కోప్షన్ సభ్యులు ఎస్‌కె.సర్దార్ పాషా కోరారు.

విద్యుత్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రాహ్మణగూడెం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్టు, చాగల్లులో అదనంగా మరో సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని స్థల సేకరణ చేస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ కె. వెంకటరమణ, ఎంపీడీవో బి.రాంప్రసాద్ కూడా మాట్లాడారు. వైస్ ఎంపీపీ చెల్లింకుల శ్రీవిజయ, ఎంపీటీసీలు సొనబోయిన అర్జునరావు, ఉభా భాగ్యవతి, ఉన్నమట్ల విజయకుమారి, తాళ్లూరి రమ్య, ఉసురుమర్తి జ్యోతి, ముళ్లపూడి గంగభావాని, చాపల రాధ, సర్పంచులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వివిధ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

దేవరపల్లి: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో గురువారం ఆయన సమీక్ష జరిపారు. గృహ నిర్మాణం, జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు, నీటి సరఫరా, రోడ్లు నిర్మాణం వంటి అంశాల పురోగతిపై అధికారులతో ఆయన చర్చించారు. గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. పునాదులు వేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని సూచించారు. జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పురోగతిపై సమీక్ష జరిపారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, అర్‌అండ్ బీ, ఇతర శాఖలపై సమీక్ష నిర్వహించారు.

8న జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన రాక

దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో ఈ నెల 8న గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జిమంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.